

ఏనుగు దాడా.. రోడ్డు ప్రమాదమా?

● మొగిలి ఘాట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి
● పోలీసు, అటవీశాఖ భిన్న ప్రకటనలు



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

బంగారుపాళ్యం, జూన్ 23: ఏనుగు రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తిని తొక్కి చంపేసిందని పోలీసులు చెబుతున్నారు.అదేమీ లేదు.. వాహనం ఢీకొని ఆ వ్యక్తి చనిపోయాడని అటవీశాఖ అంటోంది. మొగిలిఘాట్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిపై రెండు శాఖలు ఇలా పరస్పర ప్రకటనలు చేశాయి. వివరాలిలా ఉన్నాయి.బంగారుపాళ్యం మండలం.. చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిలోని మొగిలి ఘాట్‌రోడ్డులో శనివారం రాత్రి 55- 60 ఏళ్ళలోపు ఓ గుర్తుతెలియని వ్యక్తిని ఏనుగు తొక్కి చంపేసిందని అటువైపుగా వాహనాల్లో వెళుతున్న వారు 112కు ఫోన్‌చేసి పోలీసు కమాండ్ కంట్రోల్‌రూముకు సమాచారం ఇచ్చారు. అక్కడ నుంచి బంగారుపాళ్యం పోలీసులకు సమాచారం అందింది. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఆ వ్యక్తి ఘాట్‌రోడ్డు పక్కనే చనిపోయి ఉన్నాడు. సంఘటనా స్థలం నుంచే పోలీసులు పలమనేరు, బంగారుపాళ్యం రేంజ్ అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వాళ్లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు ఏనుగుదాడిలో మృతి చెందినట్లు ఆనవాళ్లు కనపడటం లేదని చెప్పారు. జాతీయ రహదారి కావడంతో అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని ఫారెస్టు అధికారులు చెప్పారు. పోలీసుల వాదన మాత్రం మరోలా ఉంది. గౌనివానిచెరువు నుంచి రోడ్డుకు అటువైపు దాటుతున్న ఏనుగు ఆ దారిలో పలమనేరు వైపుగా వెళుతున్న వ్యక్తిని తొండంతో పట్టి తలపై కొట్టడంతోనే రోడ్డుపై పడి చనిపోయాడని పోలీసులు చెబుతున్నారు.ఇలా విభిన్న అభిప్రాయాల నేపథ్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు పింక్ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి వున్నాడు. మృతుడి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని పోలీసులు కోరారు. ఏనుగుదాడిలో ఈ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వస్తే తప్ప అసలు విషయం తెలిసే అవకాశం లేదని స్థానికులు అంటున్నారు.

తరచూ ఏనుగుల సంచారం

ఇక, మొగిలిఘాట్‌లో తరచూ ఏనుగుల గుంపు ఇటువైపు నుంచి రోడ్డుకు అటువైపుగా ఉన్న అటవీప్రాంతంలోకి వెళుతుంటాయి. మామూలుగా అయితే ఆ దారిలో వెళ్లే వాహనదారులు ఏనుగుల గుంపు వెళుతుంటే దూరంగా వాహనాలను ఆపి,అవి రోడ్డును దాటుకున్న తరువాత రాకపోకలు సాగిస్తారు. రెండేళ్ల క్రితం ట్రాకర్ చిన్నబ్బను కొద్దిదూరంలో ఓ ఏనుగు తొక్కి చంపేసింది. అదేవిధంగా అరకిలోమీటరు దూరంలో ఏనుగుగుంపు రోడ్డు దాటుతుంటే మినీ లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో మూడు ఏనుగులు మృతి చెందాయి.తరచూ రోడ్డు దాటుతున్న సమయంలో ఏనుగుల నుంచి ప్రమాదం జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రోడ్డు పక్కనే పెద్ద కందకం తవ్వడం లేదా సోలారు కంచె ఏర్పాటు చేస్తే రోడ్డుదాటకుండా ఆపవచ్చని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు.



కుప్పం అర్బన్ పోలీసు స్టేషను

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం సబ్ డివిజన్లో పోలీస్ శాఖ ప్రక్షాళన జరిగింది. సీఐ, ఎస్ఐలను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ మణికంఠ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా వైసీపీతో అంటకాగడమే ఈ బదిలీలకు కారణంగా తెలుస్తోంది. అప్పటి అధికార పార్టీ వైసీపీ నేతలకు దగ్గరగా ఉంటూ.. వారి ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరించడమే కుప్పం పోలీస్‌శాఖ ప్రక్షాళనకు అసలు కారణంగా తెలుస్తోంది.

- కుప్పం

● ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు

వీరంతా వీఆర్‌కు

● వైసీపీతో అంటకాగడమే కారణం ● కుప్పంలో పోలీసుశాఖ ప్రక్షాళన

● ఎన్నికల ముందు వైసీపీ ఎమ్మెల్సీ, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ప్రచారంలో ఓటర్లకు కానుకల పంపకంలో సహకరించారన్న ఆరోపణ కుప్పం అర్బన్ సీఐ రమణ మీద ఉంది. భరత్ సతీమణి దుర్గ ఓటర్లకు చీరలను పంచి ప్రలోభాలకు గురిచేశారు. ఇతర ప్రాంతాలనుంచీ వందల సంఖ్యలో చీరలు బహిరంగంగానే తెప్పించినా పోలీసులు పట్టించుకోలేదు. తంబిగానిపల్లె చెక్‌పోస్టు వద్ద చీరలతో వస్తున్న వాహనం పట్టుబడినా, అక్కడ నిఘా ఉన్న సీఐ రమణ బిల్లులు ఉన్నాయన్న కారణం చూపి, కేసు నమోదు చేయకుండా వదిలేశారు.

● నామినేషన్ల సందర్భంగా వైసీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేయడానికి వచ్చిన ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణి దుర్గ వాహనాన్ని నేరుగా నామినేషన్ల కేంద్రంలోకి పోలీసులు అనుమతించడం వివాదమైంది.అప్పుడు రూరల్ సీఐ ఈశ్వర్ రెడ్డి విధుల్లో ఉన్నారు.సీఎం సామాజిక వర్గానికే చెందిన ఈయన్ను కేవలం ఎన్నికల సందర్భంగా వైసీపీకి సహరించేందుకే ఇక్కడికి పోస్టింగ్ ఇచ్చారన్న ప్రచారం విస్తృతంగా ఉంది.

సీఐలు, ఎస్ఐలంతా బదిలీ

కుప్పం పోలీసు సబ్ డివిజన్లో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలను వీఆర్‌కు పంపుతూ ఆదివారం ఎస్పీ మణికంఠ ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం అర్బన్, రూరల్ సీఐలు రమణ, ఈశ్వర్‌రెడ్డిని అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశార. ఇక, కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం ఎస్ఐలు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంత్, శివకుమార్, సుమన్‌ను చిత్తూరు వీఆర్‌కు పంపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనకు ఒకరోజు ముందు జరిగిన ఈ ప్రక్షాళన పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

● కుప్పం అర్బన్ ఎస్ఐ సుబ్బారెడ్డి రియల్ ఎస్టేట్, ల్యాండ్ సెటిల్మెంట్లో వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

● ఇక, రామకుప్పం ఎస్ఐ శివకుమార్‌పై పూర్తిగా వైసీపీ తొత్తుగా వ్యవహరించారన్న బలమైన ఆరోపణలు ఉన్నాయి. మార్చి నెలలో కుప్పంలో జరిగిన చంద్రబాబు బహిరంగ సభకు వెళ్లారన్న కారణంతో రామకుప్పం మండలం కావలిమడుగుకు చెందిన దళితులపై అక్రమ కేసులు బనాయించి, వేధించారని అప్పట్లో టీడీపీ ఆరోపణలు చేసింది. దీనిపై పెద్ద వివాదం రేగింది. గిరిజనులపైనా అక్రమ కేసులు బనాయించి వేధించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

● శాంతిపురం ఎస్ఐ సుమన్, ముడుపులు లేనిదే ఈ పనీ చేయరన్న ఆరోపణలతో పాటు ఎన్నికల్లో పూర్తిగా వైసీపీ తొత్తుగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు.

● క్వారీలలో వాటాలు, ముడుపులు వంటి ఆరోపణలు గుడుపల్లె ఎస్ఐ లక్ష్మీకాంత్‌పై ఉన్నాయి. వీటితో పాటు ఎన్నికల్లో వైసీపీతో అంటకాగడమే పోలీసు అధికారులు వీఆర్‌కు బదిలీ కావడం వెనుక ఉన్న బలమైన కారణమన్న ప్రచారం జరుగుతోంది.



అందమైన జిల్లా.. చిత్తూరు

● అందరి సహకారం మరువలేనిది ● కలెక్టరుగా రిలీవ్ అయిన షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 23: 'చిత్తూరు జిల్లా అందమైన జిల్లా. కలెక్టర్‌గా ఇక్కడ పనిచేసినన్ని రోజులు అందరి సహకారం మరువలేనిది' అని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. కలెక్టరు బాధ్యతల నుంచి రిలీవ్ అయిన ఆయన ఆదివారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన 14 నెలల వ్యవధిలో జిల్లా అభివృద్ధి అంశంలో ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించారన్నారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సమర్థంగా నిర్వహించేందులో అధికారులు, ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది అందించిన తోడ్పాటును ఎప్పటికీ గుర్తుంచుకుంటానన్నారు. ఎన్నికలు చక్కగా నిర్వహించేందులో పోలీసు శాఖ ఇచ్చిన సహకారం అభినందనీయమన్నారు. పరిపాలనాపరంగా ఎవరినైనా నొప్పించివుంటే మన్నించాలని, తనకు ఎవరిపైనా రాగద్వేషాలు లేవని చెప్పారు. కలెక్టర్‌గా తానున్నన్ని రోజులు మీడియా ఇచ్చిన సహకారం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానన్నారు. కాగా, షన్మోహన్ ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన సోమవారం కాకినాడకు వెళ్లి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నేడు నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 23: జిల్లా నూతన కలెక్టర్‌గా సుమిత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన్ను ప్రభుత్వం చిత్తూరు జిల్లాకు బదిలీచేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈయన సోమవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. అధికారుల నుంచి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. పుష్పగుచ్ఛాలు స్వీకరించిన అనంతరం నూతన స్పందన హాలులో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమవుతారు. మంగళ, బుధవారాల్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుప్పంలో ఏర్పాట్ల కోసం ఆయన అధికారులతో కలిసి వెళ్లనున్నారు.

సీఎం పర్యటనకు కుప్పం ముస్తాబు



కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ మార్గంలో డివైడర్లకు రంగులు



ఆర్టీసీ బస్టాండు లింక్ రోడ్డుకు మరమ్మతులు

కుప్పం, జూన్ 23: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకోసం కుప్పం ముస్తాబవుతోంది. సీఎంగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా మంగళ, బుధవారాల్లో సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించబోతున్నారు. ఈ క్రమంలో అధికారులు కుప్పాన్ని ముస్తాబు చేస్తున్నారు. తొలుత రహదారుల మధ్యనున్న డివైడర్లకు రంగులు వేశారు. సీఎం బస చేయనున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద తక్కువ సామర్థం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి.. కొత్తది ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ కార్యాలయాన్ని, ఆర్టీసీ బస్టాండును కలిపే లింక్ రోడ్డు గతుకులమయమైంది. పాడైన ప్రాంతాలలో మరమ్మతులు చేసి, రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దుతున్నారు. సీఎం చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించనున్న ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహ పరిసరాల్లో మురుగునీటి కాలువలను శుభ్రం చేయడమే కాక, కొత్త కాలువల నిర్మాణం సాగుతోంది. మున్సిపల్ కార్యాలయం కూడా నడుస్తున్న ఈ పరిసరాలలో చిన్నపాటి చినుకులకే కాలువలు పొంగి రోడ్డు మీదే మురుగు ప్రవహిస్తుంది. గతంలో నేతాజీ రోడ్డుకు అడ్డంగా తవ్వి తాత్కాలిక మరమ్మతులు చేశారు కానీ, తిరిగి కాలువలు నిర్మించకుండా మట్టితో కప్పి వదిలేశారు. ఇప్పుడు సిమెంటు కాలువల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆధునికీకరణ, రంగులు వేయడం, సరికొత్త ఫర్నిచర్ మార్చడం వంటి పనులు పూర్తయ్యాయి. భద్రతా ఏర్పాట్లకోసం ఇప్పటికే అదనపు పోలీసు బలగాలు కుప్పం చేరుకున్నాయి. కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ మూడునాలుగు రోజులుగా తరచూ కుప్పంలో పర్యటిస్తూ సీఎం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను చంద్రబాబు పరిశీలనున్నారు. శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి, జల్లిగానిపల్లెల వద్ద సీఎం పరిశీలనకు అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతోంది. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతూ టీడీపీ నేతలు స్వాగత ఫ్లెక్సీలు పెడుతున్నారు.

చంద్రబాబు పర్యటన అధికారిక షెడ్యూల్ ఇలా..

సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్‌ను ఆదివారం కలెక్టర్ షన్మోహన్ విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలోని హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకుంటారు. 12.55 గంటలకు శాంతిపురం మండలంలోని జల్లిగానిపల్లె, 1.35 గంటలకు చిన్నారిదొడ్డి గ్రామం సమీపంలో వెళ్లే హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను పరిశీలించి కుప్పంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. 3 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4.40 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పార్టీ నేతలతో సమావేశమవుతారు. రాత్రి అక్కడే బస చేస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.40 గంటలకు పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. సాయంత్రం 4.10 గంటలకు హెలికాప్టరులో బెంగళూరు బయలుదేరి వెళ్తారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, జూన్ 23: చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నూతన సమావేశపు మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, జిల్లా స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వొచ్చని సూచించారు.

ఆగని భూకబ్జాలు

కోట్ల విలువ చేసే భూమిలో అక్రమ నిర్మాణాలు
పట్టించుకోని అధికారులు

పెనుమూరు, జూన్ 23: ప్రభుత్వం మారింది. అయినా వైసీపీ నేతల కబ్జాలు ఆగలేదు. అధికారులూ తమకేమీ సంబంధంలేనట్టు చూస్తున్నారు. పెనుమూరులోని 430 సర్వే నెంబరులో 1.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకుల కన్ను పడింది. ఇళ్ల నిర్మాణాలకు పనులూ మొదలు పెట్టారు. దీనిపై వైసీపీ నాయకులే కొందరు తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది 430లో ఈ స్థలం ప్రభుత్వ భూమి అని.. ఎవరూ ప్రవేశించరాదని బోర్డును ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా అటువైపు ఎవరూ వెళ్లలేదు. ఆ తర్వాత వైసీపీ మండల స్థాయి నాయకుల అండతో, ఓ రెవెన్యూ అధికారితో కుమ్మక్కై కొందరు పొజిషన్ పట్టాలు పొందారు. ఇందులో ఒకే కుటుంబానికి రెండేసి, మూడేసి పట్టాలు కూడా ఇచ్చారు. ఈ పట్టాల కేటాయింపు సమయంలో డబ్బులు కూడా భారీగా చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. లేఅవుట్లో కాకుండా పక్కనున్న కోట్ల విలువ చేసే భూమిలో నిబంధనలకు విరుద్ధంగా ఒక్కొక్కరు 3 నుంచి 5 సెంట్ల వరకు ఆక్రమించుకుని నిర్మాణాలు మొదలుపెట్టారు. వీటిలోనూ బినామీ పేర్లతో ముఖ్య నేతలకే అధికారులు కట్టబెట్టారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే స్థలం 1.5 సెంట్లయితే ఇక్కడ మాత్రం 3 నుంచి 5 సెంట్లు కేటాయించారు. ఎన్నికల ముందు ఈ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించి పనులను ఆపమని సూచించడంతో పనులు చేయరాదని వీఆర్వో అక్కడి వారికి సూచించి ఆపించారు. అయితే ఇప్పుడు మళ్లీ నిర్మాణాలు చేస్తున్నారు. వాటిపై స్థానికులు తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తే అర్జీ ఇవ్వండి చూద్దామని చెప్పారట. అంతే కాకుండా అటువైపు ఎవరూ వెళ్లకూడదని తమ సిబ్బంది సూచించనట్లు ఓ అధికారి తెలిపారు. ప్రభుత్వం మారినా పెనుమూరులో భూ ఆక్రమణలు ఆగకపోవడం చర్చనీయాంశంగా మారింది.



ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణాలు

జోరుగా ఇసుక అక్రమ రవాణా

● రాత్రిపూట కర్ణాటకకు తరలింపు
● ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసిన పోలీసులు



పోలీసులు సీజ్‌చేసిన ఎక్స్‌కవేటర్

గంగవరం, జూన్ 23: పోలీసుల దాడులను ఇసుకాసురులు ఏమాత్రం లెక్కచేయడంలేదు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ఇసుకను అక్రమంగా కర్ణాటకకు తరలించేస్తున్నారు. ఇందుకు శనివారం రాత్రి కౌండిన్య నదీవాగులో పట్టుబడిన ఎక్స్‌కవేటరే నిదర్శనం. ఇసుకతో సులభంగా డబ్బుసంపాదించడం అలవాటు చేసుకున్న కొంతమంది ఇసుకాసురులు రింగ్‌గా ఏర్పడ్డారు. పోలీసుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ చాకచక్యంగా రాత్రికిరాత్రే ఇసుక లోడింగ్ చేసి కర్ణాటకకు తరలిస్తున్నారు. గత వారం రోజుల్లో గంగవరం పోలీసులు వరుస దాడులు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినా ఇసుక అక్రమ రవాణాను ఆపడంలేదు. శనివారం రాత్రి జీడిమాకులపల్లె సమీపంలో ఎక్స్‌కవేటరుతో టిప్పర్‌లోకి ఇసుకను లోడింగ్ చేస్తుండగా అర్బన్ సీఐ చిన్నగోవిందు, సిబ్బంది వెనుక నుండి దాడులు చేశారు. పోలీసులను గమనించిన ఇసుకాసురులు టిప్పర్‌ను వేగంగా తీసుకెళ్లిపోగా, ఎక్స్‌కవేటరు పట్టుబడింది. దీనిని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కౌండిన్య నదీ కాలువలో ఇసుక తవ్వకాలపై మరింత నిఘా ఏర్పాటు చేసి స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేయాలని ఆప్రాంత రైతులు కోరుతున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వెంకటాపురంలో కొనసాగిన వైద్య శిబిరం



గుడుపల్లె, జూన్ 23: మండలం పరిధిలోని వెంకటాపురంలో గ్రామంలో ఆదివారం అతిసార కేసులు నమోదు కాలేదు. రెండు రోజుల క్రితం వెంకటాపురంలో గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన ఆస్పత్రి పాలైన విషయం విదితమే. బాధితులు ఆస్పత్రిలో చికిత్స అనంతరం కోలుకొని తమ ఇళ్లకు చేరుకొన్నారు. వెంకటాపురం పాఠశాలలో గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో ఆదివారం కూడా వైద్య శిబిరం నిర్వహించారు. అతిసార అదుపులోకి వచ్చిందని వైద్యులు తెలిపారు. సర్పంచ్ నారాయణ, వైద్య శిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు తెలిపి పలు సూచనలు చేశారు. వైద్య శిబిరం కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

మునీశ్వరుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో మునీశ్వరుని ప్రతిమ

గుడుపల్లె, జూన్ 23: మండల పరిధిలోని యామగానిపల్లె గ్రామంలో ఆదివారం మునీశ్వరుడి జాతర వైభంగా జరిగింది. గ్రామ సమీపంలో భారీ మునీశ్వరుని ప్రతిమ ఏర్పాటు చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. గ్రామంలోని మహిళలు పిండి దీపాలతో ఊరేగింపుగా మునీశ్వరుని ప్రతిమ వద్దకు చేరుకున్నారు. భక్తులు తలనీలాలు సమర్పించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, దీపాలు వెలిగించి జంతు బలులు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గుడుపల్లెలో దంచికొట్టిన గాలివాన



గుడుపల్లె, జూన్ 23: మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన దంచికొట్టింది. 5.20 నుంచి 6.10 వరకు గాలివాన బీభత్సం సృష్టించింది. కొన్ని రోజులు పాటు ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. గాలివాన కారణంగా పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. టమోటా పంటలో కాయలు రాలిపోయాయి. అలాగే బీన్స్, చిక్కుడు పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయని రైతులు విచారం వ్యక్తం చేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యంలో ఆక్రమణల తొలగింపు



చౌడేపల్లె, జూన్23: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం ఆక్రమణను దేవదాయ శాఖ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. స్థానిక గోనలకురప్పల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వస్వామి ఆలయానికి సంతగేటు సమీపంలో, బస్టాండులో విలువైన భూములు ఉన్నాయి. ఆ భూములు వైసీపీ అండతో పలువురు ఆక్రమించుకున్నారు. చౌడేపల్లె సర్పంచ్ శ్రీరాంవరుణ్ భరత్ సహకారంతో వైసీపీ మైనార్టీ నాయకులు మహ్మద్ఆలీ ఇల్లు సైతం నిర్మించుకున్నాడు. ఆ ఇంటి పక్కన మరి కొంత మాన్యం భూమిని సైతం ఆక్రమించుకున్నాడు. ఈ విషయాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి జిల్లా దేవదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ప్రస్తుతం నిర్మించిన ఇళ్లను వదిలేసి ఆ ఇంటి పక్కలో ఉన్న మాన్యం భూమిలోని ఆక్రమణలు, మట్టిని ఆదివారం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది హరిప్రసాద్ పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు సహకరిస్తా: అమర్



జ్యోతి ప్రజ్వలన చేసి నేత్ర చికిత్సా శిబిరాన్ని ప్రారంభిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు/ గంగవరం, జూన్23 : పలమనేరులో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం పలమనేరు లయన్స్‌క్లబ్ ఆవరణలో దివంగత ఎంపీ రామక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత నేత్రచికిత్సా శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని లయన్స్‌క్లబ్ సభ్యులు కోరగా ఆయన పైవిధంగా స్పందించారు. మొత్తం 130 మందికి ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. అందులో 12 మందిని ఆపరేషన్‌కు ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రఘు, టీడీపీ నాయకులు ఆర్‌వీ.బాలాజి, సోమశేఖర్ గౌడ్, గిరి, సుబ్రమణ్యంగౌడ్, గ్యాస్ నాగరాజు, పల్లెరుచుల అమరనాథ్, కిరణ్, పీఈఎస్ వైద్యులు, పలువురు క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రహదారుల సూచిక బోర్డులు సరిచేయండి



సోమల, జూన్ 23: రోడ్లు భవనాల శాఖ ఏర్పాటు చేసిన సూచిక బోర్డుపై ఇతర సంస్థలు ఇష్టారాజ్యంగా ప్రకటనల హోరు జోరుగా ఉంది. సోమల పద్మశ్రీ క్రాస్ రోడ్డులో ఓవైపు తిరుపతికి మరో వైపు కడప రోడ్డు రెండు మార్గాలు ఉన్నాయి. అక్కడ ఆర్ అండ్ బీ శాఖ ఏర్పాటు చేసిన సూచికల బోర్డుపై ప్రకటనల కరపత్రాలు అంటించడంతో ఆ మార్గాల్లో ఏదారి ఎటు పోతుందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బీ సిబ్బంది కరపత్రాలను తొలగించి సూచిక పేర్లు కనపడేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

కంటి ఆపరేషన్లకు 32 మంది ఎంపిక



కుప్పం, జూన్ 23: సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు శారద కంటి ఆస్పత్రి వారిచే ఆదివారం ఉదయం కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. మొత్తం 120 మందికి కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 32 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరు శారద కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఈ కర్యాక్రమంలో వైద్య బృందం బాబు, లావణ్య, మటార్లపల్లి వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితకు సన్మానం



కుప్పం, జూన్ 23: రాష్ట్ర బీసీ వెల్ఫేర్, టెక్స్‌టైల్స్ మంత్రి సవితకు కుప్పం నియోజకవర్గానికి చెందిన కురబ కులస్తులు ఘన సన్మానం చేశారు. బెంగళూరు కెంపెగౌడ విమానాశ్రయంలో ఆమెను కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కురబ నాయకులు మాజీ సర్పంచి ఎం.రామచంద్ర, రాగోపాల్, లీలావెంకటేశ్, శ్రీనివాసులు, ధనశేఖర్, కదిరప్ప, బీరేశ్, మంజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాలేటమ్మకు పొంగళ్లు



సోమల, జూన్ 23: మండలంలోని కందూరులో కొలువు దీరిన పాలేటమ్మ వారి జాతర నేపథ్యంలో ఆదివారం అమ్మవారికి భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. ఉదయం పొంగుపాలు, సిద్ధపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామవీధుల్లో చెక్క భజనలు, కోలాటాల నడుమ ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. సోమవారం ఉదయం మహిళా భక్తులు బోనాలు, దీలు చెల్లించనున్నారు.

పుష్పపల్లకిపై సల్లాపురమ్మ విహారం

గుడుపల్లె, జూన్ 23: కంచుబందార్లపల్లెలోని సల్లాపురమ్మ ఆదివారం పుష్పపల్లకిపై విహరించి భక్తులను కటాక్షించారు. సల్లాపురమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, విశేషంగా పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, రంగు రంగుల పుష్పాలతో అలంకరించి పుష్పపల్లకి పై అధిష్టింప జేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, కోలాటాలు, పండరి భజనల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.

వర్షాలు కురవాలి.. పంటలు పండాలి

- ఘనంగా మొలకల పౌర్ణమి వేడుకలు



దేవరెద్దును ఊరేగిస్తున్న గ్రామస్తులు

కల్లూరు, జూన్ 23: పులిచెర్ల మండలం మతుకువారిపల్లి వడ్డిపల్లిలో మొలకల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్రారంభమైన వేడుకలు ఆదివారం ఉదయం వరకు కొనసాగాయి. ముందుగా గ్రామంలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం దేవరెద్దుకు ప్రత్యేక పూజలు చేసి పురవీధులోల ఊరేగించారు. ఆలయం ముందు మొలకలు ఉంచి పూజలు నిర్వహిస్తూ పాటలు పడారు. వర్షాలు సకాలంలో కురిసి రైతులు ఆనందంగా వ్యవసాయ పనులు చేసుకునేలా దీవించాలని ప్రార్థించారు.

సారా స్థావరాలపై దాడులు

- ఐదుగురిపై కేసు నమోదు

గుడిపాల, జూన్ 23: మండలంలోని రాసనపల్లి, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఎస్ఈబీ, గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించారు. 1,250 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. రాసనపల్లి దళితవాడకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ పోలీసులు తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత: ఎస్పీ



సభావేదిక నిర్మించనున్న ప్రదేశంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో ఎస్పీ, జేసీ

కుప్పం, జూన్ 23: సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ మణికంఠ చందవోలు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఈ నెల 25, 26 తేదీల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఎస్పీ, జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులతో కలిసి కుప్పంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొదట కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం శాంతిపురం మండలం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి ప్రాంతాల వద్ద సీఎం పరిశీలించనున్న హంద్రీ-నీవా కాలువ వద్ద ఏర్పాను సమీక్షించారు. కుప్పం ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించి పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నిర్మాణం చుట్టూ పటిష్ట బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే సభావేదిక, ప్రజల రాకపోకలకు అనువుగా, వీవీఐపీ, వీఐపీ వాహనాల స్థలాల వద్ద బందోబస్తు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఎం పర్యటనకు చర్యలు తీసుకుంటామన్నారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ప్రదేశాల్లో వివిధస్థాయిల్లో అధికారులను ఇన్‌ఛార్జిలుగా నియమించినట్లు తెలిపారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్, పంచాయతీ రాజ్ అండ్ ఆర్ అండ్ బీ ఎస్ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఏఎస్పీ పి.నాగేశ్వరరావు, కుప్పం, పలమనేరు, చిత్తూరు, నగరి ఆర్డీవోలు శ్రీనివాసులు, మనోజ్ రెడ్డి, చిన్నయ్య, వెంకటరెడ్డి, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సమష్టిగా కృషిచేద్దాం: గౌనివారి



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారిశ్రీనివాసులు

రామకుప్పం, జూన్ 23: కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబులు కోరారు. ఆదివారం టీడీపీ కూటమి రామకుప్పం మండలం విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ అరాచకపాలనలో రాష్ట్రంతో బాటూ, కుప్పం నియోజకర్గంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా సీఎం చంద్రబాబు కుప్పాన్ని ఎంతో అభివృద్ధి చేయాలన్న తలంపుతో ఉన్నారన్నారు. ఈ విషయంలో టీడీపీ శ్రేణులతో బాటు జనసేన, బీజేపీ శ్రేణులు సమన్వయంతో, ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా చూడాలన్నారు. దాడులు, అక్రమ కేసుల విషయంలో ఎవరూ కక్ష సాధింపులకు దిగరాదని సూచించారు. 25, 26 తేదీల్లో కుప్పంలో జరిగే చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా కుప్పం ఎన్టీయార్ విగ్రహం వద్ద జరిగే బహిరంగ సభకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చేలా చూడాలన్నారు. అదేవిధంగా చంద్రబాబు ఎన్నికలపై పార్టీ నేతలు, వివిధ స్థాయిల్లో ఉన్న వారితో సమీక్షిస్తారన్నారు, కొన్ని బూత్‌లలో వైసీపీకి మెజారిటీ రావడం, మరికొన్ని బూత్‌లలో మెజారిటీ ఆశించినంత స్థాయిలో రాకపోవడానికి గల కారణాలపై పక్కా నివేదికలతో పార్టీ నేతలు సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీ చిన్నకృష్ణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, మండల అధ్యక్షుడు వెంకటేష్, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న అమర్

పలమనేరు, జూన్23 : అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న సమస్యలను ఇందిరా ప్రియదర్శినిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా మంజూరైన ఇళ్లు, ప్రారంభానికి నోచుకోని ఇళ్లు, సగంలోనే ఆగిపోయిన నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలనే అంశంపై చర్చించారు. ఆయా కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఈ రమేష్‌రెడ్డి, పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వి.కోట ఏఈలు వెంకటరాజు, చంద్రారెడ్డి, స్వామిదాసు, వెంకటేషు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు గీతమ్మ, సరదా, నజ్మ, సునీత, ద్రాక్షాయిణి, అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం



పుంగనూరు రూరల్, జూన్23: పూర్వపు విద్యార్థులు గురువులకు ఘన సన్మానం చేశారు. మండలంలోని వనమలదిన్నె ప్రభుత్వ హైస్కూల్‌లో 2011-12 ఏడాదిలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసిన వారికి ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రాజు, జి.వి. రమణ, మహ్మమద్ఇక్బాల్, పవన్‌కుమార్, మోహన్, శేషాద్రినాయుడు, ఆనంద్, రాజేశ్వరి, విద్యార్థులు భార్గవ్, సురేంద్ర, జయచంద్ర, విశ్వాస్, నాగవేణి, నాగరత్న, సంధ్య, సుమతి, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రసన్నయ్యగారిపల్లెలో లోపించిన పారిశుధ్యం



పాఠశాల ముందు నిలిచిన వర్షపు నీరు

పుంగనూరు రూరల్, జూన్23: మండలంలోని ఏటవాకిలి పంచాయతీ ప్రసన్నయ్యగారిపల్లెలో పారిశుధ్యం లోపించింది. మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తూ దోమలకు నిలయాలుగా మారుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే వీధుల్లో వర్షపు నీరు నిలచి మురుగునీరుగా మారి దోమలకు అడ్డాగా మారుతోంది. ఇక పాఠశాల ముందు వర్షపు నీరు నిల్వ నిలవడం వల్ల విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లాలంటే మురుగునీటిలో దిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ముందు మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చీటీ డబ్బులు అడిగినందుకు దాడి



దాడికి గురైన జీవా, (ఇన్‌సెట్లో) తలకు అయిన గాయం

రామకుప్పం, జూన్ 23: చీటీ డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు కొందరు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయాలపాలు చేశారు. ఈ ఘటన రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. ఆరిమానిపెంటకు చెందిన జీవా చీటీలు నడుపుతున్నాడు. ఇటీవల రూ.2లక్షల చీటీ చివరకు వచ్చింది. చీటీకి సంబంధించి అతడికి అదే గ్రామానికి చెందిన మణి బాకాయి పడ్డాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చీటీ డబ్బులివ్వాలంటూ మణిని జీవా నిలదీశాడు. అదికాస్త వారిమధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో మణి, అతడి బంధువులు సూర్య, కిరణ్‌లు ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో జీవన్ చెవి, తలపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతులు లేని రొంపిచెర్ల మార్కెట్ యార్డు



రొంపిచెర్ల, 23: రొంపిచెర్ల మార్కెట్ కమిటీ ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా ఎలాంటి సౌకర్యాలూ కల్పించకపోవడంతో రైతుల్లో ఓ నిరాశ నెలకొంది. పీలేరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న రొంపిచెర్లను 15 ఏళ్ల క్రితం విడదీసి చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, రొంపిచెర్ల మండలాలతో కలిపి రొంపిచెర్ల మార్కెట్ కమిటీగా ఏర్పాటు చేశారు. మార్కెట్ కమిటీకి సుమారు 14 ఎకరాల స్థలం కేటాయించారు. మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ముగ్గురు మార్కెట్ కమిటీ చైర్మన్లు మారారు. అయినా అభివృద్ధి మాత్రం జరగలేదు. రైతులు తమ పంటలు నిలువ చేసుకొనే వసతులు, శీతలీకరణ గోదాములు, టమోటా, మామిడి, మార్కెట్లు లేవు. మార్కెట్‌యార్డులో ఉన్న గోదామును పౌరసరఫరాల సరుకులు నిల్వ చేసుకునేందుకు బాడుగకు ఇచ్చారు. రైతులు పంటలు ఆరబెట్టుకోవడానికి నిర్మించిన షెడ్డు గత గాలీవానలకు పడిపోయింది. తర్వాత తిరిగి నిర్మించలేదు. గోదాములు లేక వరి, మామిడి, వేరుశెనగలాంటి పంటలు నిల్వచేసుకోలేక పోతున్నారు. గృహాల్లో నిల్వచేసుకొనే సౌకర్యంలేక రైతులు తక్కువ ధరకే అమ్ముకుం టున్నారు. అధికారులు స్పందంచి రొంపిచెర్ల మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జోరుగా సారా అమ్మకాలు

సోమల, జూన్ 23: మండలంలో సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని పేగలవారిపల్లె, తెట్టుపల్లె, వరగానిపల్లె, బోయపల్లె, చింతలవారిపల్లె తదితర గ్రామాల్లో సారా విక్రయాలు జోరుగా ఉన్నాయని అంటున్నారు. సారా తాగి పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సారా తయారీ కుటీర పరిశ్రమగా మారిందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పశువుల వ్యాపారస్తుల ఘర్షణ



చికిత్స పొందుతున్న అర్బాజ్

పుంగనూరు రూరల్, జూన్23: పాడి ఆవుల వ్యాపారస్తులు ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. కొత్తయిండ్లుకు చెందిన అర్బాజ్, జాఫర్‌లు ఆవుల వ్యాపారం చేస్తుండేవారు. ఆదివారం వ్యాపారం విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. ఈ ఘర్షణలో అర్బాజ్‌ను జాఫర్ కొట్టడంతో అతడు గాయపడ్డాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



పుంగనూరులో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

పుంగనూరు, జూన్23: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజారెడ్డి, అయూబ్‌ఖాన్, నానబాలకుమార్, బాబు, ఆదినారాయణ, వెంకటరెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: శ్యాంప్రసాద్ ముఖర్జీ దివస్ సందర్భంగా పలమనేరు బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కన్వీ నర్ తాతయ్యానాయుడు, రమాదేవి, ఆంజ నేయులు, రాజానాయుడు, రెడ్డెప్ప నాయుడు, బసవలింగప్ప, రామక్క, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం కూల్చివేత కక్షసాధింపు చర్యే

వి.కోట, జూన్ 23: తాడేపల్లెలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని అధికారులు కూల్చివేయడం టీడీపీ కక్షసాధింపు చర్యేనని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పీ.ఎన్.నాగరాజ్ ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

న్యాయమూర్తులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచన



న్యాయమూర్తుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమరావు

చిత్తూరు లీగల్, జూన్ 23: రానున్న కొత్తచట్టాలపై న్యాయమూర్తులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమరావు సూచించారు. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లాలోని న్యాయమూర్తులకు కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత న్యాయశాఖ కొత్త చట్టాలను తీసుకుని రావడంతో పాటు కొన్ని చట్టాలకు పేర్లు మారుస్తూ శిక్ష, జరిమానాలు పెంచిందన్నారు. 2023 ఇది పూర్వం ఇండియన్ సివిల్ కోర్టు 1860గా ఉండేదని, న్యూక్రిమినల్ లా భారతీయ న్యాయ సంహిత- 2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత- 2023, భారతీయ సాక్ష్య అదిహీనియం -2023 కొత్త చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టాలు జూలై ఒకటో తేది నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ప్రాసిక్యూషన్, బెయిల్, వాయిదాలు, పరిహారం సంబంధించిన సంస్కరణలపై రీసోర్స్ పర్సన్స్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా న్యాయాధికారులకు వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా న్యాయమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రమేష్, శాంతి, వెన్నెల, మాధవి, శ్రీనివాసులు, ధర్మారావు, శ్రీదేవి, ఉమాదేవి, బాబాజాన్, కీర్తన, శిరీష, వాణిశ్రీ, విజయసారధి రాజు, గురు అరవింద్, రాఘవేంద్రతో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

● 1.120 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ జయనాయక్ కథనం మేరకు...ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో పుంగనూరు మండలం మిట్టపెద్ద తాండాలో కాపురమున్న బి.చంద్రశేఖరనాయక్, మదనపల్లెకు చెందిన వృద్ధురాలు ఆప ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సైకిల్‌పై విక్రయించడానికి తీసుకెళుతున్నారు. ఆ సమయంలో సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానంతో వారిని పిలిచి తనిఖీ చేయగా.. గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని గంజాయి సీజ్ చేసారు. విచారించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చడం తప్పా...? : టీడీపీ



మాట్లాడుతున్న దొరబాబు, సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూన్ 23: అక్రమంగా నిర్మించిన వైసీపీ భవనాన్ని కూల్చడం తప్పా అని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ప్రశ్నించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ తాడేపల్లెలో నిర్మిస్తున్న వైసీపీ కేంద్ర కార్యాలయానికి ఎటువంటి అనుమతులూ లేవన్నారు. ఆ భూమి జలవనరుల శాఖకు సంబంధించిందని, ఆ శాఖ అధికారుల అనుమతి తీసుకుని నిర్మించాలని హైకోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. అనుమతి తీసుకోకుండా నిర్మించినందున తాడేపల్లి మునిసిపల్ శాఖ అధికారులు కోర్టు అనుమతితో భవనాన్ని కూల్చివేశారని పేర్కొన్నారు. ఇందులో కక్షసాధింపు లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన జరుగుతుందని, అక్రమాలకు, అరాచకాలకు, కక్ష సాధింపులకు తావుండదని చెప్పారు.

ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి..

యువకుడి మృతి... మరొకరికి గాయాలు

చిత్తూరు, జూన్ 23: ముందు వెళుతున్న ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి కిందపడి యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వివరాల మేరకు.. నగరంలోని కయనికట్టువీధికి చెందిన పవన్‌కుమార్(18), అతని స్నేహితుడు గోకుల కృష్ణ(23) బంగారుపాళ్యంకు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. కాజూరుకు సమీపంలో ముందు వెళుతున్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో కిందపడిపోయారు. పవన్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గోకులకృష్ణకు స్వల్ప గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తం

గోనుమాకులపల్లెలో మైలారు పండుగ





మైలారు పండుగకు వచ్చిన ఎద్దులు, పశువులను నిలువరిస్తున్న యువకులు

వి.కోట, జూన్ 23: వి.కోట మండలం గోనుమాకులపల్లెలో ఆదివారం మైలారు పండుగ నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పశువులకు పరుగు పందేలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ రైతులు కొడెగిత్తలను తీసుకొచ్చారు. మూడు రౌండ్ల మేరకు కొడెగిత్తలకు పరుగులు పెట్టగా యువకులు వాటిని నిలువరించేందుకు ఉరకలు వేశారు. జనంతో గ్రామం కిక్కిరిసింది. పొలాల్లో పశువులు చేసిన విన్యాసాలు ఆసక్తిగా మారాయి. పోటీల్లో గెలుపొందిన కోడెగిత్తలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, జూన్23: బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించాక భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన వైసీపీకి చెందిన రాజభవనం వెలసింది. ఏడాదిన్నర కిందట అధికారాన్ని అడ్డుపెట్టుకుని అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని నామమాత్రపు లీజు ధరపై దక్కించుకున్న వైసీపీ పెద్దలు అందులో ఎలాంటి అనుమతులూ లేకుండా జిల్లా పార్టీ కార్యాలయం పేరిట భారీ భవంతిని నిర్మించారు. ఒకవైపు విమానాశ్రయం, మరోవైపు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల నడుమ విలువైన భూమిని ఓ రాజకీయ పార్టీకి కేటాయించడమే ఆశ్చర్యకరమైతే దానికి స్థానిక పంచాయతీ నుంచి గానీ, తుడ నుంచి గానీ అనుమతులు లేకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. టీడీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యాలయాలకు చేసిన భూ కేటాయింపులు, భవనాల నిర్మాణంపై కొత్త ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనం

విమానాశ్రయ సమీపాన వైసీపీ రాజభవనం

నామమాత్రపు లీజు ధరతో ఖరీదైన భూమి కేటాయించిన గత ప్రభుత్వం

పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూమి రాజకీయ పార్టీకి

పంచాయతీ, తుడ అనుమతులు లేకుండానే నిర్మాణం

ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఖరీదైన భూమి కేటాయింపు

రేణిగుంట మండలం జీపాలెం పంచాయతీ కుర్రకాల్వ రెవెన్యూ గ్రామం 219-15, 219-16 సర్వే నెంబర్లలోని రెండెకరాల ప్రభుత్వ భూమిని 33 ఏళ్లపాటు వైసీపీ కార్యాలయం కోసం లీజుకు కేటాయిస్తూ 2022 డిసెంబరు 20న అప్పటి ప్రభుత్వం జీవో (నెంబరు 757) జారీ చేసింది. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన భూమి కేటాయిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ భూమి విమానాశ్రయానికి చేరువగా ఆ మార్గంలోనే వుంది. గత టీడీపీ ప్రభుత్వం సరిగ్గా ఇక్కడే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా శ్రీవెంకటేశ్వర ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్లస్టర్ పరిధిలో ఇప్పటికే కార్బన్ మొబైల్స్, సెల్‌కాన్ మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థలున్నాయి. ఇక్కడి ప్రభుత్వ భూములను ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు లేదా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు కేటాయించేందుకు ఉద్దేశించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం విలువ రూ.5కోట్లకుపైగా పలుకుతోంది. ఇలాంటి చోట ఓ రాజకీయ పార్టీకి రూ.10 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని ఎకరాకు ఏడాదికి కేవలం రూ.వెయ్యి నామమాత్రపు చెల్లింపుతో లీజుపై కేటాయించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

పంచాయతీ ఇచ్చింది నిరభ్యంతర పత్రమే!

వైసీపీ కార్యాలయం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని జీపాలెం పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. భూమి కేటాయింపు ప్రక్రియలో భాగంగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని పంచాయతీ పాలకవర్గంతో ఆ మేరకు తీర్మానం చేయించారు.

అనుమతులు లేకుండానే నిర్మాణం

వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక జీపాలెం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. నిర్మాణం ప్రారంభించిన సమయంలో పంచాయతీ సిబ్బంది వెళ్లి వాకబు చేయగా కలెక్టర్ అనుమతి, తుడ అనుమతులు వున్నాయని పనులు చేపట్టిన వ్యక్తులు చెప్పినట్టు సమాచారం. అసలే అధికార పార్టీ కార్యాలయం వ్యవహారం కావడంతో పంచాయతీ సిబ్బంది మిన్నకుండిపోయారని తెలిసింది. కాగా తుడాలో ఆరా తీయగా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేయలేదని, తుడా అనుమతులు ఇవ్వలేదని వెల్లడైంది. భవన నిర్మాణం చేపట్టిన స్థలం పారిశ్రామిక వాడ పరిధిలో వున్నందున ఏపీఐఐసీ అధికారుల నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారేమోనని ఆరా తీయగా అలాంటిదేమీ లేదని తెలిసింది.

కోటపల్లిలో పంటలపై ఏనుగుల విధ్వంసం

● 21 కొబ్బరిచెట్ల నేలమట్టం



ఏనుగులు ధ్వంసం చేసిన కొబ్బరిచెట్టు, మామిడిచెట్లను చూపిస్తున్న రైతులు

కల్లూరు, జూన్ 23: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు విధ్వంసం ఆగడంలేదు. మండలంలోని పాళెం పంచాయతీలో వారం రోజులుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటివరకు ఊరికి దూరంగా ఉన్న పంటలను నాశనం చేస్తున్న ఏనుగులు శనివారం రాత్రి కోటపల్లికి ఆనుకొని ఉన్న పంటలపై పడ్డాయి. మామిడి, కొబ్బరి, పశుగ్రాసం తదితర పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. కల్లూరుకి చెందిన రైతు యుగంధర్ పొలంలోని 8 కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. 6 మామిడి చెట్లను విరిచేశాయి. రైతు పురుషోత్తానికి చెందిన 6 కొబ్బరిచెట్లను, 2 మామిడిచెట్లను, 12 రాతి కూసాలను విరిచేశాయి. అనంతరం కోటపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న బాబునాయుడు పొలంలోని 7 కొబ్బరిచెట్లను పెకలించాయి. మామిడిచెట్లను విరిచేశాయి. అర ఎకరా పశుగ్రాసాన్ని తొక్కేశాయి.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

రెండు వాహనాలు సహా నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 23: అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటరుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టేలోగా పారిపోవడానికి యత్నించారు. అయితే వారిలో ముగ్గురిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్(37), మోహనవేల్(25), శక్తివేల్(27)గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. "లించారు. కేసు నమోదు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రుయాలో వసూల్ నాయక్

● ఏపనికైనా చేయి తడపాల్సిందే
● డీహెచ్‌కు సరెండర్ చేసిన డీఎంఈ



మెడికల్ సర్టిఫికెట్ మంజూరు చేసినందుకు బాధితుడి నుంచి నగదు తీసుకుంటున్న సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్

తిరుపతి(వైద్యం), జూన్ 23: తిరుపతిలోని రుయా ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్ ఆగడాలతో విసిగిపోయిన యంత్రాంగం ఆధారాలతోసహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ (డీహెచ్)కు సరెండర్ చేస్తూ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) వారం కిందట ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అవేమీ పట్టించుకోకుండా తన చాంబర్‌లో వచ్చి కూర్చొని డ్యూటీ చేయడం మొదలుపెట్టడంతో ఆగ్రహించిన సూపరింటెండెంట్ మూడ్రోజుల కిందట ఆయన గదికి తాళాలు వేసేశారు. ఇదిలా ఉంటే మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారినుంచి సీఎస్ ఆర్ఎంవో వసూళ్లకు పాల్పడిన వీడియోలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి.

ప్రతి పనికీ ఓ రేటు

రుయాస్పత్రిలో సీఎస్ ఆర్ఎంవోగా గతేడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన లక్ష్మానాయక్ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి జోరుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు, ఫిర్యాదులున్నాయి. దీనికితోడు ఉద్యోగులతో దురుసుగా వ్యవహరించడం, మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేయడంతోపాటు రాత్రిళ్లు తనిఖీల పేరుతో మద్యం తాగి వైద్యులు, సిబ్బందిని దుర్భాషలాడతారట. ఈ విషయంపై ఇప్పటికే పీజీలు, హౌస్ సర్జన్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి ఉన్నారు.

వసూళ్లు ఇలా..

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కొన్ని ప్రైవేటు సంస్థలకు చెందిన ఉద్యోగులకు మెడికల్ లీవ్ కావాలంటే ఆర్ఎంవో, సీఎస్ ఆర్ఎంవో స్థాయి అధికారులు సంబంధిత ధ్రువీకరణ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి. ఈ మెడికల్ సర్టిఫికెట్ల కోసం రోజుకు దాదాపు 20 మందికిపైగా రుయాస్పత్రికి వస్తుంటారు. దీన్నే సీఎస్ఆర్ఎంవో స్థాయి అధికారి.. ఆదాయ వనరుగా మార్చుకున్నారట. బాధితుల అవసరాన్ని బట్టి మెడికల్ సర్టిఫికెట్ మంజూరుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తారట. దీంతోపాటు ఆస్పత్రిలోని సిబ్బందికి కోరుకున్న చోట డ్యూటీ కావాలన్నా ఆయన అడిగినంత ఇవ్వాలట. వీటితోపాటు పారిశుధ్య, సెక్యూరిటీ, రోగులకు ఆహారం సరఫరా చేసే ఏజెన్సీల పనితీరును పరిశీలించి ప్రతి నెలా తగిన మార్కులు వేసి.. బిల్లులు మంజూరు చేయడానికీ రూ.లక్షలు వసూలు చేస్తారట.

ప్రైవేటు వ్యక్తులతో వసూళ్ల పర్వం

మెడికల్ సర్టిఫికెట్లు, సిబ్బందిని భయపెట్టేందుకు ఇచ్చే మెమోలను తయారు చేసేందుకు, నగదు వసూళ్ల కోసం ఏకంగా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను తన చాంబర్‌లో నియమించుకున్నారట. దీంతో వీరిద్దరే అన్ని పనులు చూసుకోవడంతోపాటు సిబ్బందికి దిశానిర్దేశం కూడా చేస్తుండటంతో ఉన్నతాధికారులు సీఎస్ ఆర్ఎంవోను మందలించినా ఫలితం లేకపోయిందట.

సరెండర్ చేసింది వాస్తవమే

సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తుండటం, ఏజెన్సీ నిర్వాహకులను వేధించడం, మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చేవారిని ఇబ్బంది పెట్టడం వంటి పలు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆయన్ను సరెండర్ చేయాలని ఆదేశించారు. దాంతో సరెండర్ చేయడంతోపాటు రిలీవ్ చేసిన మాట కూడా వాస్తవమే. కానీ ఆయన తన గదిలోనుంచి వెళ్లకుండా కూర్చొని ఉన్నారు. ఇదేమని అడిగితే దురుసుగా ప్రవరిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు గదికి తాళం వేశాం.

- రవిప్రభు, సూపరింటెండెంట్, రుయాస్పత్రి

పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించండి



ధనుంజయయాదవ్

విజయపురం, జూన్ 23: గ్రామ పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విజయపురంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.8,629కోట్లను కేటాయిస్తే గత ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. దీనిపై పలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పకడ్బందీగా డయేరియా నియంత్రణ

చిత్తూరు, జూన్ 23: నగరంలో డయేరియా నియంత్రణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ అరుణ కోరారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలోని అధికారులకు అప్పగించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. నీటి సరఫరా, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ పిల్లల పర్యవేక్షణ, మూడేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీల శుభ్రతపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

దొరస్వామి సేవలు భేష్


దొరస్వామి దంపతులను సన్మానిస్తున్న డీఈవో దేవరాజ్

పాలసముద్రం, జూన్ 23 : మండలంలోని ఎస్ఆర్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా దొరస్వామి అందించిన సేవలు భేష్ అని డీఈవో దేవరాజ్ అన్నారు. ఆదివారం దొరస్వామి ఉద్యోగ విరమణ సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని కొనియాడారు. దొరస్వామి దంపతులను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం రఘు, ఉపాధ్యాయులు లింగమూర్తి, స్వామిరాజు, రామస్వామి రాజు, దేవయ్య, ఏలుమలై పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



పాలసముద్రం, జూన్ 23: కృష్ణజిమ్మాపురం ద్రౌపదీసమేత ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఆలయ ప్రాంగణంలో దుర్యోధనుడు, భీముడి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మహాభారతంలోని యుద్ధ ఘట్టాలను పద్యాల రూపంలో పాడి దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశంతో ఉత్సవాలు ముగిశాయి.

ఘనంగా ద్రౌపదీదేవి అగ్నిగుండ ప్రవేశం


విశేషాలంకరణలో ద్రౌపదిదేవి - అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

నింద్ర, జూన్ 23: అత్తూరు మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం అగ్నిగుండం ప్రవేశం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ద్రౌపదీ దేవి ఆలయంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పాలేపట్టు వంశీయులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం రెడ్డివారి వర్గం అన్నదానం చేశారు. అమ్మవారిని పుష్పాలతో అలంకరించి, సాయంత్రం కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. అనంతరం అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సారా స్థావరాలపై దాడులు

● ఐదుగురిపై కేసు నమోదు

గుడిపాల, జూన్ 23: మండలంలోని రాసనపల్లి, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఎస్ఈబీ, గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించారు. 1,250 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. రాసనపల్లి దళితవాడకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ పోలీసులు తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ నేత చొరవతో బాగుపడ్డ రోడ్డు



పెనుమూరు, జూన్ 23: టీడీపీ నేత, మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు చొరవతో పెనుమూరు నుంచి చిత్తూరుకు వెళ్లే మార్గంలో మఠంపల్లి వద్ద రోడ్డు బాగుపడింది. వర్షాలకు రోడ్డుపైనే నీరు నిలిచిపోయి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వార్త రావడంతో స్పందించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడి రోడ్డుకు కాలువ తీసి నీరు ఎన్టీఆర్ జలాశయంలోకి వెళ్లేలా చేశారు. అంతేగాక రెండు లారీల వెట్‌మిక్స్ తోలి గుంతలను చదును చేశారు. దీంతో వాహనాలు సాఫీగా వెళుతున్నాయి.

ఉపాధ్యాయుడికి సన్మానం



బంగారుపాళ్యం, జూన్ 23: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుళ్‌మణిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వినాయకం, ఎంఈవోలు నాగేశ్వరరావు, మోహన్, వేణుగోపాల్ రెడ్డి, విశ్రాంత ఎంఈవో చంద్రన్న, జిల్లా అధ్యక్షుడు కోటి మునిరత్నం పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం


సత్యప్రసాద్‌తో నాగరాజ్ గౌడ్

బంగారుపాళ్యం, జూన్ 23: రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గౌడ్‌ను తాడేపల్లిలో చిత్తూరు జిల్లా టీడీపీ ఈడిగ, బీసీ సాధికార సమితి అధ్యక్షుడు బుస్సా నాగరాజ గౌడ్ సన్మానించారు. బంగారుపాళ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వత భవనం మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భ జలాల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి గీత కార్మికుల సమస్యలను విన్నవించారు. బీసీ నాయకులు కొత్తపల్లి రెడ్డెప్ప గౌడ్, మురళీ గౌడ్, రమేష్, రాజమాణిక్యం, హేమచంద్ర, బాలకృష్ణ, రెడ్డిప్రకాష్ ఆయన వెంట ఉన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి



కార్వేటినగరం, జూన్ 23: ఆర్‌కేవీబీ పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నాడు నేడు పనుల్లో మంజూరైనా అమలుకు నోచుకోలేదని చెప్పారు. ప్రహరీ లేకపోవడం వల్లే రాత్రిపూట పాఠశాలలోకి అసాంఘిక శక్తులు ప్రవేశిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

కూర'గాయాలు'


ఐరాల వారపు సంతలో కూరగాయలు

ఐరాల, జూన్ 23 : కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వర్షాలకు పంటలు దెబ్బతినడంతో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఆదివారం ఐరాల వారపు సంతలో బీట్‌రూట్ కిలో ధర రూ. 70, క్యారెట్ రూ.80, వంకాయలు రూ.100, పచ్చిమిరప రూ.120, ముల్లంగి రూ.80, కూరాకు కట్ట రూ.20, కొత్తమీరకట్ట రూ.100, అల్లం రూ.180, పుదీనా కట్ట రూ.20, బీన్సు రూ.150, టమోట రూ.90 నుంచి వంద వరకు పలికాయి. కోసు రూ.50, కాకర కాయలు రూ.70, చిక్కుడు రూ.60, ఎర్రగడ్డలు రూ.35, తెల్లగడ్డలు రూ.230, పచ్చి అరటి కాయలు జత రూ.10, చేమగడ్డలు రూ.40 సొరకాయ రూ.40, కోడిగుడ్లు ట్రే(30) గుడ్లు రూ.200 పలికాయి. అలాగే కందిపప్పు రూ.180, ఉద్దిపప్పు రూ.140, పచ్చిశెనగ పప్పు రూ.90, పెసరపప్పు రూ.120, వేరుశనగ పప్పు రూ.140 ఉండడంతో బెంబేలెత్తిన సామాన్యులు ఏమీ కొనకుండానే వెనుదిరగడం కనిపించింది. గతంలో రూ.200లతో వారానికి సరిపడే కూరగాయాలు తీసుకెళ్లేవారమని, ఇప్పుడు రూ.వెయ్యి తెచ్చినా సరిపోవడం లేదని వాపోయారు.

జీడీనెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే థామస్‌ను సన్మానిస్తున్న జయశంకర్ నాయుడు

శ్రీరంగరాజపురం, జూన్ 23: గంగాధర నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీఎం థామస్ అన్నారు. ఎమ్మెల్యే హోదాలో ఆదివారం పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను పార్టీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు సన్మానించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, టీడీపీ నేతలు చంద్రబాబురెడ్డి, పుల్లారు బాబు, రుద్రప్ప నాయుడు, మునివర్ధన్ నాయుడు, ఎస్.కుమార్, గుండయ్య, సిద్ధయ్యశెట్టి, వెంకటేష్, నిరంజన్‌రెడ్డి, సూరిరెడ్డి, గురునాథం, నాగరాజు, రవిరాజు, మాధవ నాయుడు, భాస్కర్ నాయుడు, హేమాద్రి యాదవ్, శ్రీహరిరెడ్డి, బాబు నాయుడు, మోహన్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు సన్మానం


మోహన్‌మురళి, బాబునాయుడులను సన్మానిస్తున్న నాయకులు

వెదురుకుప్పం, జూన్ 23: గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా డాక్టర్ వీఎం థామస్ గెలుపునకు కృషి చేసిన నాయకులను ఆదివారం సత్కరించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళిని వెదురుకుప్పంలో టీడీపీ నేతలు తులసీరాంయాదవ్, కృష్ణమూర్తి, రాజయ్య, చంద్రయ్య శాలువ కప్పి సత్కరించారు. నల్లవెంగనపల్లెకు చెందిన టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు అధ్యక్షుడు గాలి బాబునాయుడును బీసీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కె.శివరాంయాదవ్, కె.సోమశేఖర్‌పిళ్లై, మోహన్‌యాదవ్, రాజశేఖర్‌నాయుడు సన్మానించారు.

వైభవంగా కోదండరాముడి రథోత్సవం


రథంపై స్వామి - ఎమ్మెల్యే మురళీమోహన్‌కు ప్రసాదాలు అందజేస్తున్న ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి

తవణంపల్లె, జూన్ 23: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి తోమాలసేవ, తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ చేశారు. ప్రత్యేక పుష్పాలు, అరటి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై సీతారాములను కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉభయదారుడు రామకృషాపురం గ్రామానికి చెందిన కృష్ణమూర్తినాయుడు ఆయనకు ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే!


పానాటూరు వద్ద గుంతలమయమైన తారు రోడ్డు - నక్కలపాళ్యం మట్టిరోడ్డు

గుడిపాల, జూన్ 23: మండలంలోని పలు రోడ్లు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారి, వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. జాతీయ రహదారిలోని పానాటూరు, పేయనపల్లి క్రాస్ నుంచి నక్కలపాళ్యం, నారగల్లు చెరువుకట్ట తదితర గ్రామాల్లో కొద్దిపాటి వర్షానికే మట్టి, తారురోడ్లు గుంతలమయంగా మారాయి. గుంతల్లో నీరు చేరడంతో ప్రమాదాలు జరిగి, పలువురు గాయపడ్డారు. వీటిని బాగు చేయాలని ఐదేళ్లుగా కోరుతున్నా అటు అధికారులు గాని, ఇటు ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించాలని కోరుతున్నారు.

గుడుపల్లెలో దంచికొట్టిన గాలివాన



గుడుపల్లె, జూన్ 23: మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన దంచికొట్టింది. 5.20 నుంచి 6.10 వరకు గాలివాన బీభత్సం సృష్టించింది. కొన్ని రోజులు పాటు ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడగా ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. గాలివాన కారణంగా పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. టమోటా పంటలో కాయలు రాలిపోయాయి. అలాగే బీన్స్, చిక్కుడు పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయని రైతులు విచారం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో పాలేటమ్మకు పొంగళ్లు



సోమల, జూన్ 23: మండలంలోని కందూరులో కొలువుదీరిన పాలేటమ్మవారి జాతర నేపథ్యంలో ఆదివారం అమ్మవారికి భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. అమ్మ వారికి విశేష అలంకరణలు చేశారు. ఉదయం పొంగుపాలు, సిద్ధపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామవీధుల్లో చెక్క భజనలు, కోలాటాల నడుమ ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. సోమవారం ఉదయం మహిళలు బోనాలు, దీలు చెల్లించనున్నారు.

చీటీ డబ్బులు అడిగినందుకు దాడి


దాడికి గురైన జీవా, (ఇన్‌సెట్లో) తలకు అయిన గాయం

రామకుప్పం, జూన్ 23: చీటీ డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు కొందరు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయాలపాలు చేశారు. ఈ ఘటన రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. ఆరిమానిపెంటకు చెందిన జీవా చీటీలు నడుపుతున్నాడు. ఇటీవల రూ.2లక్షల చీటీ చివరకు వచ్చింది. చీటీకి సంబంధించి అతడికి అదే గ్రామానికి చెందిన మణి బాకాయి పడ్డాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చీటీ డబ్బులివ్వాలంటూ మణిని జీవా నిలదీశాడు. అదికాస్త వారిమధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో మణి, అతడి బంధువులు సూర్య, కిరణ్‌లు ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో జీవన్ చెవి, తలపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

చిత్తూరు (సెంట్రల్), జూన్ 23: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపైనా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన ఆ సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనం జీవో 117, అసంబద్ధ వివాదాస్పద ఉత్తర్వులు నిలుపుదల చేయాలని కోరారు. బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలన్నారు. సంఘం నాయకులు మణిగండన్, సుధాకర్, మునిరత్నం, ప్రసన్నకుమార్, సరిత పాల్గొన్నారు.


చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌ను టీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుధీర్, సోమశేఖర్‌లు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. - చిత్తూరు సిటీ

పచ్చికాపల్లంలో ఎక్కడి చెత్త అక్కడే!




వెదురుకుప్పం, జూన్ 23: మండలంలోని పచ్చికాపల్లంలో మూడు రోజులుగా తొలగించక పోవడంతో ఎటు చూసినా చెత్తకుప్పలు దర్శన మిస్తున్నాయి. పచ్చికాపల్లం సుమారు 42 గ్రామా లకు కూడలి. అటు తిరుపతి ఇటు పుత్తూరు, చిత్తూరు ప్రాంతాలకు వెళ్లే వారే కాకుండా తమిళనాడులోని పళ్లిపట్టుకు తిరుపతి వైపు నుంచి వస్తుంటారు. ఇక్కడ మూడు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో చెత్త ప్రస్తుత వర్షాలకు కుళ్లి దుర్వాసన దోమలు, ఈగల మోత ఎక్కు వైంది. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశు ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


కార్వేటినగరం, వెదురుకుప్పంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 23 : జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీకి నగరంలోని బీజేపీ నాయకులు ఘన నివాళి అర్పించారు. నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర చౌదరి నివాళి అర్పించారు. ప్రధాని మోదీ ఆర్టికల్ 370ని రద్దు చేసి, శ్యాంప్రసాద్ ముఖర్జీకి నిజమైన నివాళి అర్పించారన్నారు.

కార్వేటినగరం : శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఆ పార్టీ నాయకులు ఆదివారం నివాళి అర్పించారు. యువమోర్చా నేత యువరాజు మాట్లాడుతూ బీజేపీ పటిష్ఠతకు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను కొనియాడారు.

గుడిపాల : బీజేపీ రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో నరహరిపేట హైస్కూల్‌లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

వెదురుకుప్పం : బొమ్మయ్యపల్లె పంచాయతీ తెల్లగుండ్లపల్లిలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జి చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకులు వెంకటయ్య, చిన్నబ్బ, దయాకృప, నాగార్జున, కిట్టు, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న చిట్టిబాబు


చిత్తూరులో నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు